


[1953 డిసెంబరు సంచిక తరువాయి]

## అయిదవ అధ్యాయం

మర్నాడు ఉదయం మిగిలినవాళ్ళు ప్రశ్నల పరంపర కురిపించారు ;

"మఠాధిపతితో అంతపొద్దు పోయిందాకా ఏం సంభాషణ ?"

"ఆయన ఎలాంటి మనిషి ?"

"పోర్టర్ల విషయం ఏంచెప్పాడు ?" అని అడిగాడు అభయంకర్.

విక్రం పోర్టర్ల విషయం అడగలేదు. "ఆయన చాలా వృద్ధు, జ్ఞాని. అంతకన్న చెప్పడానికేమీలేదు," అన్నాడతను.

విక్రం వాలకంచూసి అభయంకర్ నిర్ఘాంతపోయాడు. అంత చురుకైన మనిషి ఇంత నిస్సహాయు డెట్లా అయిపోయాడో అతనికి అర్థంకాలేదు. మిగిలినవాళ్ళను గురించి తనకు బాధ్యతవున్నదని అయినా అతను గుర్తించినట్టు కనబడలేదు.

నిజానికి అతనిలో మార్పేదో జరుగుతున్నది. అతని మనస్సుపై షాంగ్రిలా ప్రభావం హెచ్చిపోతున్నది. అభయంకర్ సదభిప్రాయం సంపాదించడానికైనా అతనికి ఆటే ఇచ్ఛలేదు.

ఇటువంటి మార్పు అభయంకర్‌లో లేదు. అతనికి ఈస్థలమూ, మనుషులూ అనుమానాస్పదులుగా తోచారు. ఈ మఠాధిపతి నమ్మదగినవాడేనా ? ఇక్కడ ప్రతిదీ గోప్యమే! ఉదాహరణకి, ఆపిల్ల—వీణవాయించే లో్త్సెన్—వీళ్ళమధ్యకు ఎలావచ్చింది ? ఆవిషయం ముసలాడేమన్నా చెప్పాశా ? చెప్పలేదు!

అభయంకర్‌కు అయోమయంగా కనిపించేదంతా విక్రంకు మహత్తరమైనదిగా కనిపిస్తున్నది. దీని పుట్టుపూర్వోత్తరాలు తనకు తెలుసు. మిగిలినవారికి తెలియవు. వృద్ధుకు వాటిని అప్పుడే బయటపెట్టవద్దన్నాడు. వారికి చెప్పలేని విషయాలు తెలుసుకుని తాను వారివెంట ఉండడం చాలా కష్టం. వారిభావాలు పోర్టర్ల రాకపైనా, ఇండియాకు తిరిగి పోవటంపైనా కేంద్రీకరించి ఉన్నాయి.

చాంగ్ ఇప్పుడు విక్రంతో చాలా స్వేచ్ఛగా మాట్లాడుతున్నాడు. ఆరామం గురించి వారిద్దరూ చాలా.నాళ్లు ముచ్చటించారు. అయిదు సంవత్సరాలపాటు విక్రం జీవితానికి ఎట్టి నియమాలూ ఉండవనీ, ఆ తరువాత వయసును నిగ్రహించే ప్రక్రియలు ప్రారంభమై, నలభయ్యో పడిలో అర్థశతాబ్దం గడిచిపోతుందనీ, తాను చాలా చిన్నతనంలో వచ్చాననీ, తనవయసు ఇప్పుడు తొంభైఏడనీ, శతమానం కాగానే పూర్ణసన్యాసం తనకు లభిస్తుందనీ, ఆ తరువాత సులువుగా మరో శతాబ్దంపాటు జీవించగలుగుతాననీ చాంగ్ చెప్పాడు.

"ఇప్పుడు మీరు బయటి ప్రపంచంలోకి వెళ్ళితే ఏమవుతుంది ?" అని అడిగాడు విక్రం.

"మరణం ! ఎన్నోరోజులుకూడా పట్టదు!"

"ముప్పై ఏళ్ళక్రితం బయటికి వెళ్ళితే ఏమైఉండేది ?"

"అప్పుడూ మరణమే ప్రాప్తించేదేమో. కనీసం వార్ధక్యం బయటపడేది. ఇక్కడ ఒక రష్యన్ ఉండేవాడు. యవ్వనంలో ఇక్కడికి చేరాడు. ఎనభైఏళ్లు వచ్చాయి. చూడడానికి నలభైలాగా ఉండేవాడు. ఆగంతకులెవరో వస్తున్నారని వారికొరకు లోయదాటి వెళ్ళి కొండజాతివారికి పట్టుబడ్డాడు. వారం రోజులలో తిరిగి రాలేకపోయాడు. అతను తప్పించుకుని తిరిగి రావటానికి మూడుమాసాలు పట్టింది. ఈలోపుగా అతను ముసలి ఒక్కాయిపోయాడు. తరువాత కొద్ది కాలానికే మరణించాడు కూడా."

విక్రం ఇతర సన్యాసులనుకూడా కలుసుకొని వారితో సంభాషించాడు. వీరిలో త్యాగరాజస్వామి శిష్యుడొకాయన కూడా ఉన్నాడు. వీరంతా విక్రంకన్న ఎన్నోరెట్లు వయసు గలవాళ్ళయినా వారితో మాట్లాడడానికతనికి ఇబ్బంది ఏమీ లేదు. వారందరిలోనూ అతనికి ఒక నిండుతనం, ఒక జ్ఞానజ్యోతి కనబడింది. అందరికీ పూర్వస్మృతి చాలా సూక్ష్మంగా ఉంది. అది ఇక్కడ ఇవ్వబడిన శిక్షణలో ఒక భాగమని చాంగ్ అన్నాడు. విక్రం తన గతాన్ని గురించి ఆలోచించినప్పుడల్లా తన ప్రస్తుత వాతావరణం ఎంతో ఆనందాన్నిచ్చేది. అతను తరుచు చీనా పిల్ల లోత్సెన్ సంగీతం వింటూ షాంగ్రిలా మహత్తుకు లోనయేవాడు. ఆమె చాలా మితభాషిణి. విక్రంతోనే చాలా కొద్దిగా మాట్లాడేది. తనపాట వినటానికివచ్చే అభయంకర్‌తో అసలే మాట్లాడేదికాదు.



"బంగారుభూమి"లో కుమారి సుశీల నృత్యం

ఆమెనుగురించి చాంగ్ విక్రంతో చెప్పాడు. ఆమె మంచూ రాజవంశీయురాలట. ఆమె తుర్కీరాజును వివాహ మాడబోతూ దారితప్పి షాంగ్రిలా చేరింది. ఇది 1884లో జరిగింది. అప్పుడామె వయసు 18.

"అప్పటికి పద్దెనిమిదా?" అన్నాడు విక్రం ఆశ్చర్యంతో.

"అవును. ఆమె వయసును చాలా బాగా జయించింది."

"నాకు మళ్ళీ మఠాధిపతిని దర్శించే అవకాశం ఎప్పటికి కలుగుతుంది?" అన్నాడు విక్రం.

"మరో అయిదేళ్ళకు కలగవచ్చు" అన్నాడు చాంగ్.

కాని చాంగ్ పొరపడ్డాడు. కొద్ది రోజులకే వృద్ధుడి నుంచి విక్రంకు రెండవ పిలుపు వచ్చింది. ఇంకా చాలా పిలుపులుకూడా వచ్చాయి. వృద్ధుడితో మాట్లాడుతున్నప్పుడు విక్రంకు, తాము సృష్టినీ చరిత్రనూ సింహావలోకనం చేసి అందులో కొత్త అర్థం చూస్తున్నట్టుగా తోచేది.

"నీలో వయోవృద్ధుడి లక్షణాలున్నాయి, నాయనా!" అన్నాడొకసారి వృద్ధుడు.

"అందులో ఆశ్చర్యం లేదు, జీవితం మా ఉద్రేకాలను రెచ్చగొట్టి పీల్చి పిప్పిచేసింది. యుద్ధం మా మనస్సులను అలసగొట్టింది. ఆ బడలికవెంట కొంత జ్ఞానోదయంకూడా కలిగింది." అన్నాడు విక్రం.

విక్రం మంచూ పిల్లను ప్రేమించాడు. అది ప్రతిఫలం కోరిన ప్రేమకాదు. అందులో ఉద్వేగం లేదు. ఆమె వేళ్ళు వీణాతంత్రులపై నడుస్తుంటే వచ్చేధ్వనే ఒక సాంగత్యంలా ఉండేది. ఇప్పుడు కాలం అతని అధీనంలో ఉంది. దేనికీ తాను తొందరపాటు చెందనవసరం లేదు. ఏది జరగడానికైనా అంతులేనికాలం అతని ఆధీనంలో ఉంది. ఈ భావం అతనికి ఎంత ఆనందమైనా ఇచ్చేది.

మధ్యమధ్య విక్రం తన అనుచరుల ప్రపంచంలో పడి అభయంకర్ తొందరపాటును ఎదుర్కోవలసినవాడవుతూ ఉండేవాడు. కాని షేక్‌మహమ్మదాలీ, శోభారాణీ క్రమంగా షాంగ్రిలా వాతావరణానికి లొంగిపోయినట్టు కనబడ్డారు. తమకు ఇక్కడే ఆనందంగా ఉందనీ, ఈచోటు వదిలి పోవాలన్న ఆదుర్దా తమకు లేదనీ ఇద్దరూ అన్నారు.

"ఇటువంటి చోటున్నదని తెలిస్తే వెంటనే టిక్కెట్లు బుక్‌చేసేవాళ్ళు ఎందరన్నా ఉంటారు. మనం ఇక్కణ్ణుంచి

బయటికి పోవాలని ఆదుర్దాపడటంలో నాకు అర్థం కనిపించలేదు," అనికూడా అన్నాడు షేక్‌సాయిబు.

"బోనులో పెట్టిన కోతి ఇలాగే అనుకుంటుంది" అన్నాడు అభయంకర్ ఒళ్ళుమండి.

తిరిగి పోయేది తానూ, విక్రం మాత్రమే అన్న అభిప్రాయాన్ని అభయంకర్ వెలిబుచ్చాడు. తనకు వెళ్ళాలనే ఉద్దేశం లేనట్టు విక్రం బయటపెట్టలేకపోయాడు. ఇతని సమస్యను తాను ఎప్పుడు ఏవిధంగా ఎదుర్కోవలసి వస్తుందో విక్రంకు తెలీలేదు. దాన్నిగురించి అతను బాధ పడలేదుకూడా.

ఈ మాటే విక్రం ఒక సంభాషణలో మఠాధిపతితో అన్నాడు:

"అభయంకర్ పెద్ద సమస్య కాబోతున్నాడు"

"అది నీ సమస్యే" అన్నాడు వృద్ధుడు.

"నా సమస్యా? ఏం?" అన్నాడు విక్రం.

"ఎందుకంటే, నేను మరణించబోతున్నాను"

విక్రంకు నోటమాట రాలేదు.

"అవును, నాయనా. షాంగ్రిలాలోకూడా మృత్యువు సంభవమే. దాని దర్శనం నాకు కలిగింది. నాకింక ఒకటే కర్తవ్యం మిగిలింది. అదికూడా నిన్నుగురించినదే. విను. షాంగ్రిలా భవితవ్యం నీ చేతిలో పెడుతున్నాను. నీకోసం చాలాకాలం కనిపెట్టుకుని ఉన్నాను. నీకోసం నిరీక్షిస్తూ ఈ గదిలో ఎందరికో దర్శనమిచ్చాను; ఎందరి ముఖాలో పరికించాను; ఎందరి సంభాషణలో శ్రద్ధగా ఆలించాను—నువ్వేమోనని! నేను నీకు వప్పజెప్పేది భారమైన పని. కాదు. శాంతి ఓర్పువహించడం, విజ్ఞానధనాన్ని ఆదరించడం, చుట్టూ తుఫానులు చెలరేగుతున్నా జ్ఞానాన్ని ఆరాధించడం—నీకిది సాధ్యమవుతుంది, ఆనందం ఇస్తుంది."

"ఈ తుఫాను—మీరు చెప్పే ఈ తుఫాను...."

"ప్రపంచం కనీవినని తుఫాను, నాయనా. దానిని అస్త్రాలెదిరించలేవు, అధికారులు ఆపలేరు, శాస్త్రజ్ఞానం పరిష్కరించలేదు. ఇది సంస్కృతిని తుడిచిపెట్టేస్తుంది. మానవులను అయోమయంలోకి తోసేస్తుంది. నెపోలియన్ పుట్టకపూర్వమే ఈ మహామారణం నా మనోనేత్రానికి కనబడింది. ఇప్పుడు మరింత స్పష్టంగా కనిపిస్తోంది. మహా నగరాలను మన్నుచెయ్యడానికి మారణాస్త్రాలను మోసుకుపోయే విమానాలకు షాంగ్రిలా దారికాదు. దారితప్పి ఒక విమానం వచ్చినా షాంగ్రిలాకొరకు ఆ మారణాస్త్రాలను వృథాచెయ్యరు."

"ఇదంతా నాకాలంలోనే జరుగుతుందా?"

"నువ్వీ మహా మారణాన్ని గడుస్తావు. దాని అనంతరం వచ్చే ఎడారి చరిత్రనుకూడా గడుస్తావు. మన చరిత్రను రక్షించు. దానికి నీ మనసులోని జ్ఞానాన్ని సంధించు. ఆగంతకులకు కాలజ్ఞానం బోధించు. నీ అనంతరం నీ బాధ్యతను అందిపుచ్చుకునేవాడు వస్తాడు."

వృద్ధుడి గొంతు ఆగిపోయింది. ఆయన ముఖంచూస్తూ మౌనంగా ఉండిపోయిన విక్రం కొద్దిసేపటికి వృద్ధుడు

ఆనందావారి "మేలుకొలుపు"లో జి. వరలక్ష్మి



మరణించినట్లు తెలుసుకున్నాడు. అతను బయటికి వచ్చేశాడు.

తాను ఎంతసేపు ఎటుగా నడిచిందీ విక్రం ఎరగడు. అభయంకర్ తన చేయిపట్టుకుని లాక్కుపోతున్నట్టు అతనికి కొంతసేపటికి అర్థమయింది.

"కానీ, విక్రం! తెల్లారేలోపుగా మనం బయలుదేరాలి, మనం వెళ్ళాక శోభారాణి, షేక్ సాయిబూ ఏమనుకుంటారో. వాళ్ళ ఖర్మ. వాళ్ళు లేకపోవటం మనకూ మంచిదే. పోర్టర్లు నిన్నవచ్చారు. కనుమదాటి అయిదుమైళ్ళదూరంలో ఉన్నారు. రేపు మళ్ళీ తిరిగి వెళ్ళిపోతారు. ఈ దొంగముండా కొడుకులు మనకు మాటమాత్రం చెప్పారు కారు, చూశావా ?....ఏమిటలా ఉన్నావు ? వొంట్లో బాగాలేదా ?" అన్నాడు అభయంకర్.

విక్రం ఒక కుర్చీలో చేరగిలబడి ముందుకు వంగాడు.

"జబ్బేమీలేదు. అలసటగావుంది"

"నీకోసం చాలాసేపుచూశాను. ఏమైనావు ?"

"మఠాధిపతితో మాట్లాడుతున్నాను."

"ఓ, ఇక మాట్లాడేదీ చేసేదీ లేదులే."

"అవును. ఆఖరుసారి మాట్లాడేశాను."

"నువ్వంత నిస్త్రాణగావుంటే లాభంలేదు. మనకున్న వ్యవధి చాలా తక్కువ."

"పోర్టర్ల విషయం ఏమిటో అంటున్నావు. సరిగా నా తలకెక్కలేదు." అన్నాడు విక్రం, మరోప్రపంచంలోనుంచి ఈ ప్రపంచంలో పడటానికి విశ్వయత్నంచేస్తూ.

"అవును. వాళ్ళు కొండమలుపవతల వేచివున్నారు. మనం ఇప్పుడే బయలుదేరాలి."

"ఇప్పుడే ? ఎలా ?"

"ఇంత స్తబ్ధువెలా అయిపోయావు, విక్రం ? నీలో చురుకంతా చచ్చిందా ?"

"బంగారుభూమి"లో వి. కె. రామస్వామి, అంజలి, టి. ఆర్. రామచంద్రన్



"అవికాదు. ఈ పోర్టర్లు మనకు సాయంచెయ్యొద్దా? వారితో బేరాలాడి ఒప్పించాలిగద!"

"అంతా అదివరకే ఏర్పాటుచేశా. పోర్టర్లకు డబ్బు ముందే ముట్టింది."

"ఈ ఏర్పాట్లన్నీ ఎవరు చేసిపెట్టారు?"

"మంచూపిల్ల, లో ట్సేన్. ఆమె పోర్టర్లవెంటే వుంది."

"దేనికీ?"

"మనతో వచ్చెయ్యటానికి."

విక్రం ఈ మాటతో బయటప్రపంచంలో పడి, "అర్థంలేనిమాట! అసంభవం," అన్నాడు.

అభయంకర్ నవ్వి, "ఆమెనుగురించి నాకన్న ఎక్కువ తెలుసుననుకుంటున్నావు. నీకేమీ తెలీదు," అన్నాడు.

"ఏమిటి నువ్వనేది? ఏంజరిగిందో చెప్పు. నాకంతా అయోమయంగావుంది."

"అయోమయానికేముందీ? అంత చిన్నపిల్ల ఈ ముసలాళ్ళ మధ్యనుంచి అవకాశందొరికితే పారిపోదా? ఆ అవకాశం ఆమె కిప్పుడు దొరికింది."


"ఈ విషయం నీ కెవరు చెప్పారు?"

"ఆమే చెప్పింది. శోభారాణి తాను నేర్చుకుంటున్న టిబెట్ ముక్కలుకూడ గలిపి నాతరఫున అడిగింది.... ఎందుకు నన్నలాచూస్తావు? నీ సొత్తేమి నే నపహరించలేదు."

"ఆమెనుగురించి మనం పోట్లాడుకోవద్దు. ఇక్కడినుండి బయటపడ్డాక ఆమె ఎక్కడికిపోతుంది?"

"ఎక్కడికైనాపోతుంది. చైనాకుపోతుంది. లేదా, నేనే ఆమెకు రక్షణయిస్తాను. ఆమెను ఈ నరకంనుంచి బయట పడెయ్యటమే ప్రధానం."

''బంగారు భూమి''లో టి. పి. ముత్తులక్ష్మి, అర్. కె. రావు



"ఇది నరకమని నీ కెట్లా తెలుసు ?"

"నాకు తెలుసు. ఇక్కడ అదృశ్య పిశాచాలున్నాయి. నా కీచోటు చూస్తేనే కంపరం. మరో విషయం దేనికి ? దీని ప్రభావం నిన్నేంచేసిందో చూడు."

విక్రం సంగతంతా అభయంకర్‌కు చెప్పనిశ్చయించాడు. "నీకు కొన్ని విషయాలు చెబితే నీ కీ భయాలు పోతాయి. ఆమెను నువ్వెందుకు వెంటతీసుకుపోలేవో కూడా నీ కర్థమవుతుంది," అంటూ వివరంగా తాను షాంగ్రిలానుగురించి తెలుసుకున్న విషయాలూ, వృద్ధుడు చెప్పిన విషయాలూ చెప్పేశాడు. వృద్ధుడి చావుగురించీ, తనమీదపడిన బాధ్యతగురించీ మాత్రం చెప్పలేదు.

అంతావిని అభయంకర్, "నీకు నిజంగా పిచ్చెత్తింది విక్రం," అన్నాడు. "మతి మతిలో ఉన్నవాడు ఇలాటి విషయాలను ఎలా నమ్ముతాడో నా కర్థం కాకుంటావుంది. మనుషులు వందలకొద్దీ ఏళ్ళు బతికామని నీకు చెప్పటమేమిటి ? నువా బొల్లికబుర్లు నమ్మటమేమిటి ? తట్టా బుట్టా సర్దుకో, బయలుదేరుదాం."

"నేనా జీవితానికి తిరిగిపోలేను, అభయంకర్," అన్నాడు విక్రం.

"కరాచీలో కొందరన్నారు—నీకు కొంత చిత్త చాంచల్యం ఉందని. నే నప్పుడు నమ్మలేదు....నేను వస్తానని మాటయిచ్చాను ; వెళ్ళితీరాలి."

"ఎవరికి మాటయిచ్చావు ? లోట్సేన్‌కేనా ?"

"అవును."

అభయంకర్ విక్రం కరస్పర్శచేసి వెళ్ళిపోయాడు. ఈ రెండు ప్రపంచాల మధ్య సామరస్యం సాధ్యంకాదనీ, ఇందులో ఒక ప్రపంచం పతనావస్థలో ఉందనీ విక్రంకు తోచింది. అతనట్లాగే కూర్చుని సిగరెట్లు కాల్చేస్తున్నాడు. ఆఖరు సిగరెట్టు అయిపోతుండగా, మూడుగంటలప్పుడు అభయంకర్ తిరిగి గదిలోకి వచ్చాడు.

"ఏం జరిగింది ? ఏం తిరిగొచ్చావ్ ?" అన్నాడు విక్రం.

అభయంకర్ పాలిపోయి ఉన్నాడు. అతని శరీరం కంపిస్తోంది.

"మనం తాళ్ళుకట్టుకుని నడిచిన చోట....నాకు ధైర్యం చాలలేదు....అసలే కొండలెక్కటం అలవాటు లేదు. వెన్నెలలో ఆ దారి మరీ భయంకరంగా కనబడింది.... చూడు, విక్రం. నాకోసం బయలుదేరి రమ్మని అడగడం నాకే బాగాలేదు. ఇక్కడ ఏముంది ? మన స్నేహితం నీకు లెక్కలోకి రాదా ? చిన్నపిల్ల లోట్సేన్‌మీదనైనా నీకు కనికరంలేదా ?"

"లోట్సేన్ చిన్నపిల్ల కాదు," అన్నాడు విక్రం.

"అవునవును ! ఆమెకు పదిహేడేళ్ళు కాదు—తొంభై దాటాయి !"

"ఆమె ఇక్కడికి 1884లో వచ్చింది."

"నీకు పూర్తిగా మతిపోయింది."

"ఆమె సౌందర్యం ఈ లోయదాటితే నిలవదు, అభయంకర్. సౌందర్యానికి ఆదరంఉన్నచోటే అది మన్నుతుంది."

"కాదు, ఇక్కడే ఆమె సౌందర్యం వ్యర్థమవుతున్నది."

"అభయంకర్, నువ్వీపిల్లను ప్రేమిస్తున్నావా ?"

"అవును, ప్రేమిస్తున్నాను. నీకు నమ్మకం లేకపోవచ్చును."

"నాకు నమ్మకమే. ఈ ప్రపంచంలో నేను గణించేది కూడా నిన్నూ, ఆ పిల్లనూ మాత్రమే."

"అయితే ఆమె చిన్నపిల్లకాదని ఎట్లా అనగలవు, విక్రం ?"

"చిన్న పిల్లేనని నువుమాత్రం ఎలా చెప్పగలవు ?"

అభయంకర్ పక్కకిచూస్తూ, "అనుభవంవల్ల...ఆమె నిజంగా చాలా చిన్నపిల్ల. ఇందులో నేను సిగ్గుపడవలసినదేమీ లేదు. ఇద్దరమూ ఒకరినొకరు ఆకర్షించుకున్నాం. ఇలాటి మేముచేసిన పని ఒకటే నిజంగా మంచిదంటాను-" అన్నాడు.

విక్రం కిటికీవద్దకు వెళ్ళి వెన్నెలలో ప్రకాశించే కరకల్ శిఖరాన్ని చూశాడు. ఒక అందమైన కల కరిగిపోతున్నట్టూ షాంగ్రిలా మండపాలు ఒరిగి పడిపోతున్నట్టూ, యౌవనంతో కూడిన ప్రణయ ప్రవాహంలో ప్రపంచ భవితవ్యం కొట్టుకుపోతున్నట్టూ అతనికి తోచింది. తనమనసు మారుతున్నది. అది ఉన్మాద స్థితిలోనుంచి యథాస్థితికి వస్తున్నదీ, యథాస్థితినుండి ఉన్మాదంలో ప్రవేశిస్తున్నదీ అతనికి తెలియలేదు. అతను అభయంకర్ కేసి తిరిగి, "నేను తోడుంటే ఆ కొండ దాటగలనంటావా ?" అన్నాడు.

అభయంకర్ ఎగిరి గంతేసి, "నిజంగా వచ్చేస్తున్నావా విక్రం ? ఇప్పటికైనా నీ బుద్ధి మారిందా ?" అన్నాడు.

అరుణోదయం అయేవేళకు వారు లోయదాటి పోర్టర్లున్న చోటికి చేరారు. వాళ్ళు వీరికోసమే కనిపెట్టుకుని ఉన్నారు. వారి గమ్యస్థానం తూర్పుగా పదకొండు వందలమైళ్ళ దూరంలోగల చైనా సరిహద్దు. వారివెంట లోబ్సెన్‌కూడా ఉంది. ఆమె ముఖాన ఎన్నడూలేని ఆనందం కనిపించింది. ఆమె కళ్ళు అభయంకర్‌మీదే ఉన్నాయి.

## పరిశిష్టం

న్యూఢిల్లీలో ఎర్రకోటలో తరుచు జరిగే చిన్నచిన్న పార్టీలలో ఒకటి జరుగుతోంది. వాటికి రకరకాల వ్యక్తులు హాజరవుతూంటారు. ఈరోజు పార్టీలో ఇద్దరు చిరకాల మిత్రులు, కొన్ని ఏళ్ళుగా ఒకరినొకరు చూచుకోనివారు కలుసుకున్నారు. ఇద్దరూ పశ్చిమ పంజాబుకు చెందినవారే కావటంచేత వారి సంభాషణ మతహత్యలమీదికీ, స్త్రీ అపహరణలమీదికీ, ఆస్తుల పేచీలమీదికీ పోయింది.

"చాలా ఘోరం జరిగిపోయింది. కాని చేసేదేమీ లేదు. కిందటి నెల కరాచీ వెళ్ళిన పార్టీతో నేనూ వెళ్ళాను. ఆస్తుల సమస్య పరిష్కరింతామనే ఉద్దేశంలోనే వాళ్ళూ ఉన్నారు. కాని అంతా అయోమయంగా ఉంది. పరిష్కారం అయేసరికి చాలాకాలం పట్టేట్టుంది," అన్నాడు లల్లూసింగ్.

"ఏమన్నాకానీ! నాది పాకిస్తాన్‌లో పూచికపుల్ల లేదు. ఉన్నా నేను బాధపడిఉండను," అన్నాడు కర్తార్.

"అవును. నీదంతా మొదటినుంచీ విక్రం ధోరణే.... పాపం, విక్రంను హత్యచేశారు దొంగముండాకొడుకులు! పాకిస్తాన్ అవతరణ జ్ఞాపకం వచ్చినప్పుడల్లా నాకు విక్రం జ్ఞాపకంవస్తాడు, అతని విచిత్రమరణం సంగతి బహుశా నీకు తెలీదనుకుంటాను. ఆ దుస్సంఘటన పత్రికల కెక్కకుండా దాచాం," అన్నాడు లల్లూ.

కర్తార్ ఏదో అనబోయి ఆగి, "ఏమిటా సంఘటన ?" అన్నాడు.

ఆగస్టు 15న కరాచీ విమానకేంద్రంనుంచి ముగ్గురు పురుషులతోనూ, ఒక స్త్రీతోనూ పరారీఅయిపోయిన విమానంగురించి చెప్పాడు. కర్తార్ నవ్వి తనకా విషయం ఇంకా చాలా తెలుసునన్నాడు.

"ఎవరు చెప్పారు నీకు ?" అన్నాడు లల్లూ.

"విక్రంసింగ్."

ఈసారి లల్లూ నిర్ఘాంతపోయాడు. "విక్రం బతికున్నాడా ?"

"కిందటి నెల నేను చూసినప్పటికి బతికున్నాడు."

"ఎక్కడచూశావు ? ఏమన్నాడు ?"

"అంతా సావకాశంగా చెబుతాను. నవంబరులో నేను నాన్కింగ్‌వెళ్ళి వారంరోజులుండి వచ్చాను. అది కూడా చాలాచెప్పాలి. కొమింటాంగ్ పరిపాలన చెప్ప శక్యంకాకుండావుంది. అంతా సావకాశంగా మాట్లాడుకుందాం. రాత్రికి నా ఇంటికి వచ్చెయ్యి."

ఆరాత్రి సహపాఠులిద్దరూ చాలా పొద్దుపోయినదాకా మాట్లాడుకున్నారు.


"నాన్‌కింగ్‌లో నేను హోటల్‌లో దిగిన అయిదు నిమిషాలలో నాకు విక్రం కనిపించాడు. అచ్చమైన చైనా దుస్తులు ధరించివున్నాడు. కాని గుర్తుపట్టటానికి వీలుగానే ఉన్నాడు. నన్ను గుర్తించలేకపోయాడు మొదట్లో. తరవాత నాపేరు తనే గుర్తుపట్టాడు.

"'ఇక్కడికి కెట్లావచ్చావ్ ? ఏంచేస్తున్నావ్ ?' అని అడిగాను.

"తనకేమీ జ్ఞాపకంలేదన్నాడు. జబ్బుగా ఆస్పత్రిలో ఉండి రెండురోజులక్రితం బయటికివచ్చానన్నాడు. నాకప్పటికి విమానం పరారీగొడవ తెలీదు. తెలిస్తే అతని స్మృతి వెంటనే తిరిగివచ్చేదనుకుంటాను. ఆరోజుకు నేను పెందలాడి పని ముగించుకుని విక్రంను వెంటపెట్టుకుని ఒక దక్షిణాది మిత్రుడి ఇంటికి వెళ్ళాను. ఆయన పేరు నువు వినేవుంటావు—రామన్, ఎస్. కె. రామన్. చైనాభాష కూడా ధారాళంగా మాట్లాడతాడు. కొడుక్కి చైనాపిల్లను చేసుకున్నాడుకూడా.

"రామన్‌కు ఇద్దరుకూతుళ్ళున్నారు. ఇద్దరూ వీణ వాయిస్తారు. మద్రాసీసంగీతం. విక్రంను రామన్‌గారికి పరిచయంచేసాను. ఆయిన కుమార్తెలు మాకు జంటవీణలమీద పాటి వినిపించారు. చెబితే నువు నమ్మవు—విక్రం ఆ సంగీతాన్ని చాలా శ్రద్ధగావిన్నాడు. అతనికి దక్షిణాది సంగీతంలో ఆసక్తివుందని నేను కలలోకూడా అనుకోలేదు. నాకుమాత్రం ఆ సంగీతం ఏమీ పట్టలేదు.

"తరువాత రామన్ కుమార్తెలు వెళ్ళిపోయినారు. రామన్ మమ్మల్ని భోజనానికుండమన్నాడు. అచ్చమైన



శ్రీ గోకుల్‌వారి "నిరుపేదలు"లో రమణారెడ్డికీ, చదలవాడ కుటుంబరావుకూ, సురభి బాలసరస్వతికీ ఏదో సమస్య ఏర్పడ్డట్టుంది

చైనా ఆహారం పెడతానన్నాడు. నేనూ రామన్ కొన్ని విషయాలు మాట్లాడుకోసాగాం, ఇంతలో మాకు వీణ వాయింపు వినపడింది. విక్రం ఒక వీణముందు కూచుని ఆ మద్రాసీ సంగీతం వాయించేస్తున్నాడు. మేమిద్దరమూ ఆశ్చర్యపోయాం. కాని రామన్ గారు ఆశ్చర్యపడింది మరొకదానికని నాకు అర్థమయింది.

"మీరు వాయించే పాట ఏమిటి?" అని అడిగాడు రామన్.

"ఏదో త్యాగరాజకృతి" అన్నాడు విక్రం పరధ్యానంగా.

"అసంభవం!" అన్నాడు రామన్ ఉద్రేకంతో. 'త్యాగరాజస్వామి రచించిన రెండువేల కృతులు నాకు రావు నిజమేగాని ఆయన ఆనందభైరవిలో కృతి రాయలేదని రూఢిగా చెప్పగలను. కాని ధోరణిచూస్తే త్యాగరాజస్వామిది కాదగినట్టుగా ఉంది! ఏమిటీ చిత్రం!'

"విక్రం కాస్సేపు ఏదో జ్ఞాపకం తెచ్చుకునేవాడల్లే కనబడ్డాడు. అతని మొహంలో చాలాబాధ కనిపించింది. ఆఖరుకతను, 'అవును, జ్ఞాపకం వచ్చింది. ఈ కృతిని నాకు నేర్పింది త్యాగరాజు శిష్యుడే.' అన్నాడు.

"రామన్ పొందిన విస్మయాన్ని వర్ణించను. ఆ రాత్రి మేం హోటలుకు తిరిగి వచ్చేసరికి విక్రం స్మృతి పూర్తిగా తిరిగివచ్చింది. ఆ రాత్రి అతను నాకు తనకథ యావత్తూ చెప్పేశాడు. నేను దాన్ని వివరంగా రాసిపెట్టానుకూడా. తీరిక ఉన్నప్పుడు చదువు." అంటూ కర్తార్ లేచివెళ్ళి డ్రాయర్‌లోనుంచి లావుపాటి నోటుబుక్కొకటి తెచ్చి లల్లూసింగు కందించాడు.

"తరువాత విక్రం ఏమైనాడు?" అన్నాడు లల్లూసింగు.

"నాకు తెలీదు. నేను మర్నాడుదయం లేచి వెళ్ళేసరికి విక్రం గదిలో లేడు. నాకొక చీటీ వదిలిపెట్టి వెళ్ళాడు. తాను వెళ్ళిపోతున్నాననీ, బహుశా తిరిగి కలుసుకునే అవకాశం ఉండదనీ చీటీలో ఉంది," అన్నాడు కర్తార్. ★

[ఒక ఇంగ్లీషు నవల దీనికి ఆధారం.]

సమాప్తం